# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

పాఠము ఐదు

## ప్రవచనము యొక్క చారిత్రిక విశ్లేషణ

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతము .......... 1
ఆరంభ రాచరికము .......... 1
**ప్రధానమైన సంఘటనలు .......... 2**
ఐక్య రాజ్యము .......... 2
రాజ్యము యొక్క విభజన .......... 2
**ప్రవచనాత్మక పరిచర్యలు .......... 3**
నిబంధనా ఆదర్శకములు .......... 3
రాజ్యము యొక్క విభజన .......... 3
అష్షూరు ద్వారా తీర్పు .......... 4
**ప్రధానమైన సంఘటనలు .......... 4**
సిరియా-ఇశ్రాయేలు కూటమి .......... 4
షోమ్రోను పతనము .......... 5
సన్హెరీబు దండయాత్ర .......... 5
**ప్రవచనాత్మక పరిచర్యలు .......... 6**
యోనా .......... 6
హోషేయ .......... 6
ఆమోసు .......... 7
మీకా .......... 8
నహూము .......... 8
యెషయా .......... 9
బబులోను ద్వారా తీర్పు .......... 9
**ప్రధానమైన సంఘటనలు .......... 10**
మొదటి దండయాత్ర .......... 10
రెండవ దండయాత్ర .......... 10
మూడవ దండయాత్ర .......... 11
**ప్రవచనాత్మక పరిచర్యలు .......... 11**
యిర్మీయా .......... 11
జెఫన్యా .......... 12
యోవేలు .......... 12
ఓబద్యా .......... 13
హబక్కూకు .......... 13
యెహెజ్కేలు .......... 14
దానియేలు .......... 15
పునరుద్ధరణ కాలము .......... 16

**ప్రధానమైన సంఘటనలు........................................................................................ 16**
ఇశ్రాయేలీయులు దేశమునకు తిరిగి వచ్చుట ........................................................ 16
దేవాలయము యొక్క పునర్నిర్మాణం ................................................................ 16
విస్తృతమైన మతభ్రష్టత్వము ............................................................................ 17
**ప్రవచనాత్మక పరిచర్యలు ................................................................................ 17**
హగ్గయి.............................................................................................................. 17
జెకర్యా ............................................................................................................. 18
మలాకీ............................................................................................................... 18
**ముగింపు ......................................................................................................... 19**



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# ఆయన మనకు ప్రవక్తలను అనుగ్రహించాడు

పాఠము ఐదు

ప్రవచనము యొక్క చారిత్రిక విశ్లేషణ

## ఉపోద్ఘాతము

ఈ మధ్య ఒక స్నేహితుడు నాకు కథ ఒక చెప్పాడు. అతడు కొన్ని సంవత్సరముల క్రితం వివాహం చేసుకున్నాడు మరియు అతని భార్య పాత సరుగును శుభ్రపరచుచుండగా గతములో అతని ప్రియురాలు ఇచ్చిన లేఖ ఆమెకు కనిపించింది. దానిని చూడగానే ఆమె కొంత కలవరపడింది, ఎందుకంటే ఆ లేఖ ఇటీవల వ్రాయబడింది అని ఆమె అనుకున్నది, కాని కవరును మరియు ఆ కవరుమీద ఉన్న తేదీని బట్టి ఆ లేఖ కొన్ని సంవత్సరముల క్రితం వ్రాయబడింది అని నా స్నేహితుడు రుజువు చేయగలిగాడు. ఆ తరువాత, నా స్నేహితుడు నావైపు చూసి ఇలా అన్నాడు, "రిచ్, నీకు ఏమి చెప్పాలో నాకు అర్థం కావడం లేదు, ఎందుకంటే ఆ లేఖ ఎప్పుడు వ్రాయబడిందో నేను రుజువు చేయలేకపోతే ఏమి జరిగియుండేదో నేను ఊహించలేను." దురదృష్టవశాత్తూ, చాలాసార్లు క్రైస్తవులు పాత నిబంధన ప్రవచనమును అపార్థం చేసుకుంటారు ఎందుకంటే ప్రవక్తలు ఎప్పుడు మాట్లాడారో లేదా తమ పుస్తకములను ఎప్పుడు వ్రాశారో అను విషయమును వారు అంతగా పట్టించుకోరు. మరియు మనము పాత నిబంధన ప్రవక్తలను బాధ్యతాయుతముగా అధ్యయనము చేయాలనుకుంటే, వారు పరిచర్య జరిగించిన కాలమును మరియు తేదీలను అర్థము చేసుకోడానికి మనం సిద్ధంగా ఉండాలి.

ఈ పాఠమునకు మేము "ప్రవచనము యొక్క చారిత్రిక విశ్లేషణ" అను పేరు పెట్టాము, మరియు పాత నిబంధన ప్రవచనమును సరిగా అర్థం చేసుకొనుటకు పాత నిబంధన చరిత్ర ముఖ్యమైన నేపథ్యమును అందించు విధానమును మనము పరిశీలన చేయబోవుచున్నాము. మన చారిత్రిక విశ్లేషణ ప్రవచనాత్మక చరిత్రలోని నాలుగు ప్రధాన కాలములుగా విభాగించబడుతుంది: మొదటిగా, ఆరంభ రాచరికము; రెండవదిగా, అష్షూరు ద్వారా తీర్పు కాలము; మూడవదిగా, బబులోను ద్వారా తీర్పు కాలము; మరియు చివరిగా, పునరుద్ధరణ కాలమును మనం చూడబోవుచున్నాము. ఆరంభ రాచరిక కాలమును మొదటిగా చూద్దాము.

## ఆరంభ రాచరికము

రాచరికము ప్రాముఖ్యతను సంతరించుకున్నప్పుడు ఇశ్రాయేలులో ప్రవచనము కూడా ప్రాముఖ్యతను సంతరించుకున్నది అని మునుపటి పాఠంలో మనం చూశాము. కాబట్టి ఆరంభ రాచరికమును – ఇశ్రాయేలు దేశము మొదటిగా రాజులను కలిగియున్న దినములను – చూస్తూ ప్రవచనము యొక్క చారిత్రిక విశ్లేషణను ఆరంభించుట సహాయకరంగా ఉంటుంది. అబ్రాహాము కాలము నుండి అనగా క్రీ.పూ. 2000 నుండి సౌలు దినముల వరకు నివసించిన ఇశ్రాయేలుకు మానవ రాజు లేడు. అయితే దావీదు యొక్క రాజ్యము సుమారు క్రీ.పూ. 1000లో స్థాపించబడింది, మరియు అనేక తరముల పాటు అతని రాజ్యము స్థిరముగా ఉండినది. ఇశ్రాయేలు చరిత్ర యొక్క ఈ కాలమును మనం



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి.

అన్వేషించుచుండగా, రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలను మనం అడుగబోవుచున్నాము: ఈ కాలములో జరిగిన ప్రధానమైన సంఘటనలు ఏవి మరియు ఈ సంఘటనలు ప్రవచనాత్మక పరిచర్యలను ఎలా రూపొందించాయి?

## ప్రధానమైన సంఘటనలు

ఆరంభ రాచరికములో జరిగిన రెండు ప్రధానమైన సంఘటనలను మొదటిగా పరిశీలిద్దాము. ముందుగా, ఐక్య రాజ్యమును గూర్చి మాట్లాడదాము.

### ఐక్య రాజ్యము

సుమారు క్రీ.పూ. 1000లో యెరూషలేములోని సింహాసనమును దావీదు అధిరోహించాడు. అతడు గోత్రములన్నిటిని ఐక్యపరచి, రాజ్యమునకు భద్రతగా సరిహద్దులను ఏర్పరచి, తన కుమారుడు దేవునికి దేవాలయమును నిర్మించుటకు ఏర్పాట్లలో భాగంగా దేవుని మందసమును యెరూషలేముకు తీసుకొనివచ్చాడు. దావీదు కుమారుడైన సొలొమోను తన తండ్రి అడుగుజాడల్లో నడిచాడు. ఇశ్రాయేలు భూభాగములను విస్తరించాడు మరియు గోత్రములను ఐక్యపరచాడు. అదే విధంగా, సొలొమోను మహిమగల దేవాలయమును నిర్మించి, యెహోవాను ఆరాధించుట కొరకు దానిని ప్రతిష్టించాడు. దావీదు మరియు సొలొమోను సంపూర్ణులైన రాజులు కారని సమూయేలు, రాజులు మరియు దినవృత్తాంతముల గ్రంథములు స్పష్టం చేస్తాయి. అయినప్పటికీ, దేవుని ప్రజలు ఎన్నో మేలులు పొందిన ఈ కాలమును ఆదర్శవంతమైన కాలముగా బైబిలు పరిగణిస్తుంది.

### రాజ్యము యొక్క విభజన

ఈ ఆరంభ సంవత్సరములలో పరిస్థితులు మంచివిగా ఉన్నప్పటికీ, మరొక ప్రధానమైన సంఘటనను మనం జ్ఞాపకము చేసుకోవాలి, అది రాజ్యము యొక్క విభజన. విచారకరంగా, సొలొమోను మరియు అతని కుమారుడైన రెహబాము ఉత్తర గోత్రములను గౌరవముతో చూడలేదు, కాబట్టి ఉత్తర గోత్రములు విడిపోయి సుమారు క్రీ.పూ. 930లో తమ సొంత రాజ్యమును ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘటనలను గూర్చి 1 రాజులు 12 మరియు 2 దినవృత్తాంతములు 11లో మనము చదువుతాము. రెహబాము ఉత్తర గోత్రములను న్యాయముగా చూచుటకు తిరస్కరించినప్పుడు, వారు విడిపోయి తమ సొంత రాజ్యమును ఏర్పాటు చేసుకున్నారు. యరొబాము I ఉత్తర గోత్రములకు రాజై, దాను మరియు బేతేలులోని ఆరాధనా కేంద్రములతో పాటుగా షోమ్రోనులో రాజధానిని ఏర్పాటు చేశాడు. ఇప్పుడు, యరొబాము దక్షిణ రాజ్యము మీద తిరుగుబాటు చేసి దానికి చాలా దూరమయ్యాడు. దాను మరియు బేతేలులోని ఆరాధనా కేంద్రములలో విగ్రహములను ఉంచాడు, మరియు ఇలా చేయుట ద్వారా ఉత్తర రాజ్యము తీవ్రమైన దుర్నీతికి లోనైంది. రాజ్యము యెహోవా స్వామిభక్తి నుండి వెనుదిరిగి, తమ నిబంధనా బాధ్యతలకు అప్పగించుకొనుటకు తిరస్కరించింది. ఇప్పుడు, ఈ కాలంలో యూదా రాజ్యములో కూడా ఒడిదుడుకులు ఉన్నాయి, కాని ఎక్కువ శాతం ఉత్తర ఇశ్రాయేలు రాజ్యము కంటే ఈ రాజ్యము మరింత నమ్మకముగా ఉండినది.

కాబట్టి ఆరంభ రాచరికములో రెండు ప్రధానమైన సంఘటనలను మనం చూశాము: మొదటిగా, దావీదు మరియు సొలొమోను ఆధ్వర్యంలో ఐక్య రాజ్యము, ఈ కాలములో ప్రజలు బహుగా ఆశీర్వదించబడ్డారు, మరియు తరువాత రెహబాము దినములలో రాజ్యము విభజించబడింది.

ఇప్పటివరకు మనము ఆరంభ రాచరిక కాలములో జరిగిన రెండు ప్రధానమైన సంఘటనలను చూశాము గనుక, ఈ సంఘటనలు ప్రవక్తల యొక్క పరిచర్యలను ఎలా రూపుదిద్దాయి అను ప్రశ్నను ఇప్పుడు మనం అడగాలి.

## ప్రవచనాత్మక పరిచర్యలు

పాత నిబంధన గ్రంథములో పదహారుమంది ప్రవక్తలు ఉన్నారు, మరియు వీరి పరిచర్యలను గూర్చి పాత నిబంధన గ్రంథములోని పెద్ద మరియు చిన్న ప్రవచన గ్రంథములు సంగ్రహంగా చెబుతాయి. ఆరంభ రాచరిక కాలము ప్రవచనాత్మక కార్యముతో నిండిపోయింది అని సమూయేలు, రాజులు మరియు దినవృత్తాంతముల గ్రంథములు స్పష్టం చేస్తాయి, కాని వీటిలో ఏ పుస్తకము కూడా ఆ కాలములో వ్రాయబడింది కాదు. మనము అధ్యయనం చేస్తున్న ప్రవచన గ్రంథములకు ఆరంభ రాచరికము నేపథ్యమును మాత్రమే అందిస్తుంది అని మనం మాట్లాడవచ్చు. ఇప్పుడు ఈ నేపథ్యమును కనీసం రెండు మార్గములలో మనం చూద్దాము.

### నిబంధనా ఆదర్శకములు

ఒకవైపు, తరువాత-కాలములోని ప్రవక్తలు ఐక్య రాజ్య దినములను ముఖ్యమైన రాచరిక నిబంధనా ఆదర్శకములను స్థిరపరచే దినములుగా పరిగణించారు. ప్రజల కొరకు వారు కలిగియున్న నిరీక్షణలన్నిటిని ప్రవక్తలు దేవుడు దావీదుతో చేసి మరియు సొలొమోనుతో స్థిరపరచిన నిబంధన మీద ఆధారము చేసుకున్నారు. దావీదు మరియు సొలొమోను దినముల వలెనే ఇశ్రాయేలు రాజ్యము యూదా రాజ్యముతో ఐక్యపరచబడు దినము కొరకు వారు వేచిచూశారు. దావీదు సింహాసనము మరలా భద్రపరచబడి, భూభాగములు మరలా విస్తరించబడు దినముల కొరకు వారు వేచిచూశారు. కాబట్టి ఈ కోణంలో, ఐక్య రాజ్యము పాత నిబంధన ప్రవచన గ్రంథములకు నేపథ్యమును ఏర్పాటు చేస్తుంది.

### రాజ్యము యొక్క విభజన

మరోవైపు, రచయితలైన ప్రవక్తలు రెండు వేర్వేరు రాజ్యములలో పరిచర్య చేశారు అను వాస్తవమునకు రాజ్యము యొక్క విభజన కూడా ఒక నేపథ్యమును అందించింది. ఈ రాజ్యములకు సాపేక్షంగా వేర్వేరు చరిత్రలు ఉన్నాయి. కొందరు ప్రవక్తలు ఉత్తర రాజ్యములో యెహోవాకు సేవ చేస్తూ, నిబంధనా తీర్పు వస్తుందని బెదిరిస్తూ, రాబోవు గొప్ప స్వస్థత మరియు ఆశీర్వాదమును గూర్చి ఆ కాలపు ప్రజలకు హామీ ఇచ్చారు. వారు తమ దృష్టిని ఉత్తర గోత్రముల రాజధానియైన షోమ్రోను మీద కేంద్రీకరించారు. ఇతర ప్రవక్తలు యూదా రాజ్యములో యెహోవాకు సేవచేశారు మరియు దక్షిణములో ఉన్న దేవుని ప్రజలకు తీర్పులను గూర్చి హెచ్చరించారు మరియు ఆశీర్వాదములను గూర్చి ప్రకటించారు, కాని వారు యెరూషలేము మరియు యూదా వంశము మీద దృష్టిని కేంద్రీకరించారు.

ఆరంభ రాచరిక కాలం నుండి ఏ రచించు ప్రవక్త కూడా రానప్పటికీ, ఈ కాలము ప్రవక్తలందరి పరిచర్యలకు ఒక ముఖ్యమైన నేపథ్యమును ఏర్పాటు చేసిందని మనం కనుగొంటాము. ఆరంభ రాచరిక కాలము నిబంధనా ఆదర్శకములను స్థిరపరచింది మరియు ఉత్తర, దక్షిణ రాజ్యముల యొక్క వాస్తవికతను కూడా స్థిరపరచింది.

ఇప్పటివరకు ఆరంభ రాచరిక నేపథ్యమును మనము చూశాము. గనుక ఇప్పుడు ప్రవచనాత్మక చరిత్రలోని రెండవ ప్రధానమైన కాలమును చూద్దాము: అష్షూరు ద్వారా తీర్పు కాలము.

## అష్షూరు ద్వారా తీర్పు

మునుపటి పాఠంలో మనం చూసినట్లుగా, నిబంధనా ప్రజలు దేవునికి నమ్మకముగా ఉండి స్వామిభక్తి చూపించవలసిన బాధ్యత కలిగియున్నారు, మరియు వారు ఈ నిబంధనను ఉల్లంఘించినప్పుడు, దేవుడు యుద్ధము ద్వారా పంపు తీర్పును వారు ఎదుర్కొంటారు. అష్షూరు ద్వారా తీర్పు కాలము దేవుడు తన ప్రజల మీద గొప్ప యుద్ధము పంపించిన మొట్టమొదటి తరుణమైయున్నది. యుద్ధములో ఓటమి అను దైవిక తీర్పు దేవుని ప్రజల మీదికి అష్షూరు సామ్రాజ్యం ద్వారా ముఖ్యముగా 734 నుండి 701వ సంవత్సరములో వచ్చింది. క్రీ.పూ. 8వ మరియు 7వ శతాబ్దములలో, అష్షూరు సామ్రాజ్యం బలం పొందుకొని అనేక రాజ్యాలను జయించింది. అది అధికారములో ఉన్న రోజులలో, అష్షూరు సామ్రాజ్యం ఆధునిక టర్కీ దేశము మొదలుకొని, పర్షియన్ గల్ఫ్ మరియు దక్షిణమున ఐగుప్తు వరకు వ్యాపించింది. ఇటువంటి పెద్ద మరియు దురాక్రమణము గల సామ్రాజ్యముతో వ్యవహరించుట ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యములకు తప్పలేదు. అష్షూరు ద్వారా తీర్పు కాలమును విశదీకరించుటకు, మనము రెండు విషయాలను మరలా చూద్దాము: ఈ కాలములో జరిగిన ప్రధానమైన సంఘటనలు ఏమిటి, మరియు ఈ శతాబ్దములలో పరిచర్య చేసిన ప్రవక్తలను ఇవి ఎలా ప్రభావితం చేశాయి?

### ప్రధానమైన సంఘటనలు

అష్షూరు రాజ్యము ఆధిపత్యము చేసిన శతాబ్దములలో పాత నిబంధన గ్రంథములోని ప్రవచన గ్రంథములను ప్రభావితం చేసిన ప్రధానమైన సంఘటనలు ఏమిటి? కనీసము మూడు ప్రధానమైన చారిత్రిక సంఘటనలు జరిగాయి, అవి మన అధ్యయమునకు ముఖ్యమైనవిగా ఉన్నాయి: మొదటిగా, సిరియా-ఇశ్రాయేలు కూటమి; రెండవదిగా, షోమ్రోను పతనము; మరియు మూడవదిగా, సన్హెరీబు దండయాత్ర.

#### సిరియా-ఇశ్రాయేలు కూటమి

సిరియా-ఇశ్రాయేలు సంకీర్ణములో, ఆ కాలములో అష్షూరు నియంత్రణలో ఉన్న మూడు చిన్న రాజ్యముల మధ్య వివాదము కూడా ఒక భాగంగా ఉంది: సిరియా, ఉత్తర ఇశ్రాయేలు మరియు యూదా.

పాత నిబంధన గ్రంథములో అనేక చోట్ల ఈ సంఘటనలను గూర్చి మనం చదువుతాము, కాని వాటిలో ఒక ఆసక్తికరమైన వాక్యభాగము ఏమిటంటే యెషయా 7. సుమారు 734లో, సిరియా మరియు ఉత్తర ఇశ్రాయేలు అష్షూరు సామ్రాజ్యముకు పన్ను చెల్లించుటలో అలసిపోయాయి, కాబట్టి అష్షూరీయులు వారి సామ్రాజ్యములోని కొన్ని ఇతర భాగాలలో ఇబ్బందులను ఎదుర్కొనుచున్నందున అష్షూరీయులను ప్రతిఘటించుటకు ఒక సంకీర్ణమును నిర్మించాలని వారు నిర్ణయించుకున్నారు. తమ సొంత కూటమిని నిర్మించుకొనుటతో పాటుగా, ఇశ్రాయేలు మరియు సిరియా రాజ్యములు తమతో చేరమని యూదా రాజ్యమును బలవంతం చేయడానికి ప్రయత్నించాయి. కాని యూదా రాజైన ఆహాజు, వారితో చేరడానికి తిరస్కరించి అష్షూరు నుండి సహాయము కోరాడు. ఈ సంఘటనలు దేవుని ప్రజలకు అనేక ఫలితాలను కలిగించాయి, అయితే ఆ ప్రధానమైన పరిణామాలలో కనీసం ఒక దానిని గూర్చి ఇక్కడ మనం తెలుసుకోవాలి. ఉత్తర మరియు దక్షిణ రాజ్యాలు రెండూ అష్షూరుతో వివాదములో ఉన్నాయి. ఉత్తర ఇశ్రాయేలు రాజ్యము అష్షూరుతో తిరుగుబాటు చేసింది గనుక అష్షూరు రాజు వచ్చి, ఉత్తర ఇశ్రాయేలు మీద దండెత్తి దానిని నాశనము చేశాడు. యూదా రాజ్యము కొంతకాలం అష్షూరుతో పొత్తు కలిగి ఉండినది, కావున అది అష్షూరు సామ్రాజ్యముకు గొప్ప కప్పము మరియు గొప్ప పన్నులు చెల్లించవలసి ఉండినది. అయితే, తుదకు, యూదా రాజ్యము కూడా అష్షూరు మీద తిరుగుబాటు చేసింది గనుక దక్షిణమునున్న యూదా  రాజ్యము మీదికి కూడా తీర్పు రాబోతుంది.

### షోమ్రోను పతనము

అష్షూరు ద్వారా తీర్పు కాలములో జరిగిన రెండవ ప్రధానమైన సంఘటన షోమ్రోను పతనము. షోమ్రోను ఉత్తర ఇశ్రాయేలుకు రాజధానిగా ఉండినది మరియు సిరియా-ఇశ్రాయేలు సంకీర్ణముగా తిరుగుబాటు చేసిన కారణంగా అష్షూరు పత్రీకారమునకు ఆస్పదముగా మారింది. ఈ సంఘటనను గూర్చి మనము 2 రాజులు 17వ అధ్యాయములో చూడవచ్చు. గొప్ప అష్షూరు సైన్యము ఇశ్రాయేలు మీద కవాతు చేసి షోమ్రోనును నాశనము చేసింది, మరియు అష్షూరీయులు అనేకమంది ఉత్తర ఇశ్రాయేలీయులను చెరగొనిపోయారు. ఇప్పుడు, ఈ సంఘటన దేవుని ప్రజలకు ఒక నూతన దినముగా గుర్తించబడింది, కాని పెద్ద ఎత్తున చెరగొనిపోబడుట రూపములో నిబంధనా తీర్పు యొక్క ముగింపు అష్షూరీయుల చేతిలో ఉత్తర ఇశ్రాయేలు నాశనం చేయబడుటతో వాస్తవానికి మొదటిసారి జరిగింది.

### సన్హెరీబు దండయాత్ర

అష్షూరు ద్వారా తీర్పులోని మూడవ ప్రధాన సంఘటన సన్హెరీబు యూదా రాజ్యము మీద దండయాత్ర చేసినప్పుడు జరిగింది. ఉత్తర రాజ్యము నుండి రక్షించబడుటకు వారు తమ్మునుతాము అష్షూరుకు అర్పించుకున్నారు కాబట్టి యూదా రాజ్యము కొంతకాలము అష్షూరు ఉగ్రతను తప్పించుకొన్నది. అయితే, తరువాత, యూదా రాజ్యము కూడా అష్షూరు మీద తిరుగుబాటు చేసి ఈ గొప్ప సామ్రాజ్యము యొక్క కోపమును ఎదుర్కొనింది. యూదా రాజ్యముకు వ్యతిరేకంగా అనేకమైన దాడులు జరిగాయి, కాని వాటిలో అత్యంత తీవ్రమైనది క్రీ.పూ. 701లో సన్హెరీబు దండయయాత్ర అయ్యున్నది. ఈ సంఘటనను గూర్చి 2 రాజులు 18 మరియు 19వ అధ్యాయములో మనము చూడవచ్చు. అష్షూరీయులు అనేకమైన యూదా పట్టణములను నాశనము చేస్తూ యెరూషలేము వరకు వచ్చారు. వాస్తవంగా చెప్పాలంటే, యూదా రాజైన, హిజ్కియా సహాయము కొరకు యెహోవా వైపు

తిరిగేవరకు సమస్తము నాశనమైపోయినట్లు కనిపిస్తుంది. యూదా రాజ్యము అష్షూరు రాజ్యముకు సామంత రాజ్యముగా మిగిలిపోయిందిగాని, హిజ్కియా మరియు సన్హెరీబు దండయాత్ర దినములలో సంపూర్ణ నాశనమును అది తప్పించుకొగలిగింది.

కాబట్టి అష్షూరు ద్వారా తీర్పు కాలములో మూడు ప్రధానమైన సంఘటనలు జరిగినట్లు మనము చూస్తాము: మొదటిగా, 734లో సిరియా-ఇశ్రాయేలు కూటమి; రెండవదిగా, క్రీ.పూ. 722లో షోమ్రోను పతనము; మరియు చివరిగా, 701లో సన్హెరీబు దండయాత్ర.

అష్షూరు ద్వారా తీర్పు కాలములో జరిగిన అనేక ప్రధానమైన సంఘటనలను మనము చూశాము గనుక, ఈ మూడు సంఘటనలు ప్రవక్తల యొక్క పరిచర్యలను ఎలా ప్రభావితం చేశాయో పరిశీలించుదాము.

## ప్రవచనాత్మక పరిచర్యలు

అష్షూరు ద్వారా తీర్పు ప్రవక్తల పరిచర్యల మీద గొప్ప ప్రభావము చూపింది. పాత నిబంధనలో మనకున్న పదహారు పుస్తకములలో, ఆరు పుస్తకాలు యెహోవా యొక్క రాయబారులు చేసిన పరిచర్యలను గూర్చి నివేదిస్తాయి. యోనా, హోషేయ, ఆమోసు, మీకా, నహూము మరియు యెషయా. అష్షూరు ద్వారా తీర్పు జరిగిన కాలములో ఈ ప్రవక్తలందరు పరిచర్య చేశారు. అష్షూరు ద్వారా వచ్చిన తీర్పును గూర్చి ఈ ప్రవక్తలు ఏమి చెప్పారో క్లుప్తంగా చూద్దాము.

### యోనా

మొదటిగా మనము యోనాను గూర్చి చెప్పాలి. 2 రాజులు 14:25 ప్రకారం, సుమారు క్రీ.పూ. 793-753 వరకు ఉత్తర ఇశ్రాయేలు రాజ్యములో రాజుగా ఉన్న యెరొబాము II కాలములో ప్రవచించడానికి దేవుడు యోనాను పిలచాడు. మరియు యోనా పరిచర్య స్థలము ప్రవక్తలందరిలో ఒక ప్రత్యేకమైన స్థలముగా ఉండినది ఎందుకంటే అష్షూరు రాజధాని పట్టణమైన నీనెవెకు వెళ్లమని దేవుడు అతనిని పిలచాడు. అతడు అష్షూరు రాజధాని పట్టణమైన ఈ నీనెవె పట్టణమునకు వెళ్లి యెహోవా వాక్కును ప్రకటించాడు, మరియు యోనా 3:4లో మనము చదువునట్లుగా అతని యొక్క సందేశం చాలా సరళంగా ఉంది:

> ఇక నలువది దినములకు నీనెవె పట్టణము నాశనగును (యోనా 3:4).

యోనా బహుగా దుఖించునట్లు, నీనెవె పట్టణము యెహోవా వాక్కును వినినప్పుడు పశ్చాత్తాపపడింది, మరియు పట్టణము మీదికి రప్పిస్తాననిన విపత్తును దేవుడు రప్పించలేదు. దేవుని దయ అష్షూరు సామ్రాజ్యమంతటి చెడ్డ సామ్రాజ్యముకు కూడా వ్యాపించింది అని యోనా పరిచర్య సూచిస్తుంది.

### హోషేయ

అష్షూరు ద్వారా తీర్పు కాలములో పరిచర్య జరిగించిన రెండవ ప్రవక్త ఎవరనగా హోషేయ. ఉజ్జియా, యోతాము, ఆహాజు, హిజ్కియా అను యూదా రాజుల దినములలో హోషేయ పరిచర్య

జరిగించాడని హోషేయ 1:1 సెలవిస్తుంది. ఉజ్జియా పాలించిన చివరి సంవత్సరము సుమారు క్రీ.పూ. 740 మరియు హిజ్కియా పాలించిన మొదటి సంవత్సరము సుమారు క్రీ.పూ. 716. ప్రవక్తయైన హోషేయ పరిచర్య సుదీర్ఘ కాలం పాటు జరిగింది అని ఈ కాల వ్యవధి సూచిస్తుంది. సుమారు క్రీ.పూ. 750 మొదలుకొని క్రీ.పూ. 722లో షోమ్రోను పతనము వరకు ఉత్తర ఇశ్రాయేలు రాజ్యములో అతడు పరిచర్య జరిగించాడు. ఆ సమయంలో హోషేయ బహుశా దక్షిణముకు వలస వెళ్లాడు. కాబట్టి సిరియా-ఇశ్రాయేలు కూటమికి ముందు శ్రేయస్సు కలిగిన దినములు మొదలుకొని షోమ్రోను పతనము వరకు హోషేయ ప్రవచించినట్లు మనం చూడవచ్చు.

హోషేయ ప్రవచనముల యొక్క దృష్టి అతడు ఉత్తర ఇశ్రాయేలులో పరిచర్య చేసినట్లు వెల్లడిచేస్తుంది. అతని ప్రవచనములు చాలావరకు ఉత్తర రాజ్యములోని అవినీతి మరియు చెడు కార్యములకు హెచ్చరికలుగా ఉన్నాయి. హోషేయ యొక్క ముఖ్యమైన సందేశము ఏమనగా: ఉత్తర రాజ్యము పాపముతో పాడైపోయింది గనుక ఇశ్రాయేలు మరియు షోమ్రోను ప్రాంతములను నాశనము చేయుటకు దేవుడు అష్షూరీయులను తీసుకువచ్చుట ద్వారా తీర్పు తీర్చబోతున్నాడు. ఈ ప్రవచనము, వాస్తవంగా చెప్పాలంటే, షోమ్రోను పతనముతో నెరవేర్చబడింది. అయినప్పటికీ, హోషేయ నిరీక్షణను గూర్చి కూడా ప్రకటించాడు. చెర తరువాత కూడా, ఒక దినమున పునరుద్ధరణ అను నిబంధనా ఆశీర్వాదము కలుగుతుంది అని అతడు చెప్పాడు.

### ఆమోసు

అష్షూరు ద్వారా తీర్పు మీద దృష్టి పెట్టిన మూడవ ప్రవక్త ఆమోసు. యూదారాజైన ఉజ్జియా మరియు ఇశ్రాయేలు రాజగు యరొబాము కాలములో ఆమోసు పరిచర్య జరిగించాడు అని ఆమోసు 1:1 చెబుతుంది. ఆమోసు సుమారు క్రీ.పూ. 760 నుండి 750 వరకు పరిచర్య జరిగించాడని ఈ వచనము అతని కాలవ్యవధిని అందిస్తుంది. 734లో సిరియా-ఇశ్రాయేలు కూటమికి ముందే ఆమోసు పరిచర్య చేశాడు. ఉత్తర ఇశ్రాయేలు శ్రేయస్సుగా ఉన్న కాలములో మరియు యరొబాము II పాలనలో వారు నిర్లక్ష్యముగా ఉన్న దినములలో అతడు పరిచర్య జరిగించాడు. మరియు హోషేయ వలెనే, ఆమోసు కూడా ఉత్తర ఇశ్రాయేలు రాజ్యములో పరిచర్య చేశాడు, మరియు అతని సందేశం ఈ విధంగా ఉంది – అష్షూరు ద్వారా తీర్పు రాబోతుంది, షోమ్రోను పతనమవ్వబోతుంది మరియు చెర జరుగబోతుంది అని తన సమకాలీనులకు హెచ్చరించాడు. ఆమోసు 5:27లో ఇశ్రాయేలీయులకు ఆమోసు ఈ విధంగా సెలవిచ్చాడు:

> "కాబట్టి నేను దమస్కు పట్టణము అవతలికి మిమ్మును చెరగొని పోవుదును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు; ఆయన పేరు సైన్యముల కధిపతియగు దేవుడు (ఆమోసు 5:27).

ఈ పుస్తకము యొక్క చివరి భాగములో, చెర ఇశ్రాయేలు యొక్క ముగింపు కాదని ఆమోసు పునరుద్ఘాటించాడు. పునరుద్ధరణ జరుగబోతుంది, మోషే వాగ్దానం చేసిన చెర తరువాత పునరుద్ధరణ అను నిబంధనా ఆశీర్వాదమును ఆమోసు కూడా పునరుద్ఘాటించాడు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## మీకా

అష్షూరు ద్వారా తీర్పును గూర్చి ప్రకటించిన నాలుగవ ప్రవక్త మీకా. యోతము, ఆహాజు, హిజ్కియా అను యూదా రాజుల దినములలో షోమ్రోను మరియు యెరూషలేమును గూర్చి అతడు ప్రవచించాడు అని మీకా 1:1 చెబుతుంది. యోతాము పరిపాలన యొక్క చివరి సంవత్సరమైన క్రీ.పూ. 735 మొదలుకొని, 701లో సన్హెరీబు దండయాత్ర చేసిన దినముల వరకు మీకా దేవుని ప్రవక్తగా పనిచేశాడు. హోషేయ మరియు ఆమోసుల వలే కాకుండా, మీకా యూదాలో, ప్రత్యేకముగా యెరూషలేము ప్రాంతములో పరిచర్య చేశాడు. సులభంగా చెప్పాలంటే, మీకా సందేశము ఏమనగా షోమ్రోను మరియు యెరూషలేము రెండింటికీ దేవుడు అష్షూరీయుల ద్వారా తీర్పు తీర్చబోతున్నాడు. షోమ్రోను నాశనము చేయబడకుండా తప్పించుకొంటుందని అతనికి ఒక చిన్న ఆశ ఉండినది, మరియు యెరూషలేము నాశనము చేయబడుతుంది అని అతడు దానిని హెచ్చరించాడు. సన్హెరీబు దండయాత్ర సమయములో, యెరూషలేమును ఏ శత్రువు కూడా నాశనము చేయలేడు అని చెప్పు అబద్ధ ప్రవక్తలను మీకా వ్యతిరేకించాడు. పశ్చాత్తాపపడకపోతే యెరూషలేము నాశనము అవుతుందని అతడు వాదించాడు. అయినప్పటికీ, చెరపట్టబడినప్పటికీ కూడా, ఒక దినమున దేవుడు తన శత్రువుల మీద ప్రతీకారం తీర్చుకొని అష్షూరీయుల చేతిలోనుండి తన ప్రజలను విడిపించి తమ దేశములో నిబంధనా ఆశీర్వాదములను పునరుద్ధరించుటకు మరియు ప్రజలను ఐక్యపరచుటకు ఒక గొప్ప రాజును తీసుకువస్తాడని మీకా ఇశ్రాయేలుకు మరియు యూదాకు నిరీక్షణను ఇచ్చాడు.

## నహూము

అష్షూరు ద్వారా తీర్పు సమయంలో పరిచర్య చేసిన ఐదవ ప్రవక్త నహూము. నహూము యొక్క పరిచర్య కాలమును గూర్చి అతని పుస్తకము స్పష్టముగా తెలియపరచదు, కానీ అతని పుస్తకములోని విషయముల నుండి దానిని మనం గ్రహించవచ్చు. అతని పరిచర్య క్రీ.పూ. 663 మరియు 612 మధ్యకాలములో జరిగింది. అతని పుస్తకములోని రెండు వచనములు దీనికి అవకాశములను ఇస్తాయి. 3:8లో ఐగుప్తు పట్టణమైన థీబెస్ అప్పటికే అష్షూరీయుల స్వాధీనంలో ఉందని మనం కనుగొంటాము, మరియు ఈ సంఘటన క్రీ.పూ. 663లో జరిగింది. అయినప్పటికీ అష్షూరు రాజధానియైన నీనెవె పట్టణము యొక్క నాశనమును గూర్చి ప్రవక్త ప్రకటించాడు, మరియు 3:7లో అతడు దానిని గూర్చి భవిష్యత్తు సంఘటనగా చెప్పాడు. నీనెవె పట్టణము యొక్క నాశనము క్రీ.పూ. 612లో జరిగింది, కాబట్టి అతని పరిచర్య ఆ గొప్ప సంఘటనకు ముందే జరిగిందని మనకు తెలుస్తుంది.

నహూము యూదా రాజ్యమును గూర్చి మాట్లాడాడు అని 1:15లో మనము చదువుతాము, కాబట్టి అతడు యూదాలో పరిచర్య చేశాడని మనం నిశ్చయత కలిగియుండవచ్చు, కాని నహూము తన దృష్టిని యూదా రాజ్యము మీద కాకుండా అష్షూరు మీద కేంద్రీకరించాడు. అప్పటికే ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యములు రెండూ కూడా అష్షూరు చేతిలో తీవ్రంగా బాధననుభవించాయి, మరియు ఈ బాధల మధ్య, నహూము ఒక ముఖ్యమైన సందేశం అందించాడు: దేవుడు అష్షూరును నాశనము చేయబోతున్నాడు. రాజధాని పట్టణమైన నీనెవెను నాశనము చేయుట ద్వారా దేవుడు అష్షూరును శిక్షిస్తాడని అతడు యూదా రాజ్యముకు హామీ ఇచ్చాడు. 3:5-7లో మనము చదువునట్లుగా, యెహోవా ఈ మాటలు పలికాడు:

> సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు ఇదే “నేను నీకు విరోధినైయున్నాను,” ... నీ మీద మాలిన్యమువేసి నిన్ను అవమానపరచెదను. అప్పుడు నిన్ను చూచు వారందరు నీయొద్ద నుండి పారిపోయి నీనెవె పాడైపోయెనే, ... అందురు (నహూము 3:5-7).

### యెషయా

అష్షూరు ద్వారా తీర్పు మీద దృష్టి పెట్టిన ఆరవ ప్రవక్త యెషయా. ఉజ్జియా యోతాము ఆహాజు హిజ్కియాయను యూదా రాజుల దినములలో యెషయా పరిచర్య చేశాడు అని యెషయా 1:1 నమోదు చేస్తుంది. సుమారు క్రీ.పూ. 740 నుండి కనీసము క్రీ.పూ. 701లో సన్హెరీబు దండయాత్ర తరువాత వరకు అతడు పరిచర్య చేశాడని రాజులను గూర్చిన ఈ నివేదిక మనకు తెలియజేస్తుంది. యెషయా ఇశ్రాయేలు-సిరియా కూటమి, షోమ్రోను పతనము మరియు సన్హెరీబు దండయాత్ర సమయంలో పరిచర్య చేశాడని మనం చూడగలము. అతడు యూదాలో, ప్రత్యేకముగా యెరూషలేములో పరిచర్య చేశాడని యెషయా గ్రంథము యొక్క విషయసూచిక తెలియజేస్తుంది. అష్షూరు ద్వారా తీర్పు సమయంలో యెషయా యూదా రాజ్యమును అనేక విధాలుగా హెచ్చరించాడు. సిరియా-ఇశ్రాయేలు కూటమి సమయంలో యెహోవా మీద విశ్వాసం మరియు నమ్మకం ఉంచాలని అతడు పిలుపునిచ్చాడు. సన్హెరీబు దండయాత్ర సమయంలో, యెరూషలేము విమోచన కొరకై యెహోవాను నమ్మాలని రాజైన హిజ్కియాను యెషయా ప్రోత్సహించాడు. అతని పరిచర్యను గూర్చిన ఈ భాగములలో ఒక ముఖ్యమైన సందేశం ఉంది: అష్షూరు ద్వారా తీర్పులను ఎదుర్కొన్నందున యూదా రాజ్యము యెహోవాను విశ్వసించాలి. వాస్తవంగా చెప్పాలంటే, ఇశ్రాయేలీయులు యెహోవాను విశ్వసించనప్పుడు, ఇశ్రాయేలుకు మరొక హెచ్చరిక ఇవ్వబడింది: యూదా రాజ్యము కూడా చెరగొనిపోబడుతుంది. అయినను అనేక ఇతర ప్రవక్తల వలెనే, చెర తరువాత యూదా రాజ్యము కూడా పునరిద్ధరించబడుతుంది అని యెషయా ధృవీకరించాడు.

కాబట్టి అష్షూరు ద్వారా తీర్పు కాలము ప్రవక్తల పరిచర్యలకు గణనీయమైన పరిణామాలను కలిగించే అనేక ముఖ్యమైన సంఘటనలను కలిగి ఉందని మనం చూశాము. ఇది దేవుని ప్రజలకు అనేక కష్టాలను మరియు ఇబ్బందులను కలిగించే సమయం కాబోతుందని ప్రవక్తలకు తెలుసు. గనుక వారు తీర్పును గూర్చిన మాటలను ప్రకటిస్తూ వచ్చారు, కాని ప్రకాశవంతమైన దినము రాబోతుందని కూడా వారు ప్రోత్సహించారు.

అష్షూరు ద్వారా తీర్పు కాలములో ప్రవక్తలు ఏ విధంగా పరిచర్య చేశారో మనం చూశాము గనుక, బబులోను ద్వారా తీర్పు కాలమును గూర్చి ఇప్పుడు చర్చించవలసి ఉంది.

## బబులోను ద్వారా తీర్పు

పాత నిబంధనలో రచయితలైన ప్రవక్తలందరికీ ఆరంభ రాచరికం ఒక నేపథ్యమును ఏర్పాటు చేసిందని ఇప్పటివరకు మనం చూశాము. క్రీ.పూ. 734 నుండి 701 వరకు అష్షూరు ద్వారా తీర్పు జరిగిన కాలము యోనా, హోషేయ, ఆమోసు, మీకా, నహూము మరియు యెషయా పరిచర్యలకు చారిత్రిక



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

నేపథ్యమును ఏర్పాటు చేసింది అని కూడా మనం చూశాము. ప్రవచనాత్మక పరిచర్యలోని మూడవ ప్రధాన కాలముకు మనం వచ్చాము, అది బబులోను ద్వారా తీర్పు. ఈ తీర్పు కాలము క్రీ.పూ. 605 నుండి 539 వరకు వ్యాపించింది.

అనేక విధములుగా ప్రవక్తయైన యెషయా అష్షూరు ద్వారా తీర్పు మరియు బబులోను ద్వారా తీర్పు కాలములకు మధ్య ఒక కీలును ఏర్పరుస్తాడు. సన్హెరీబు దండయాత్ర దినములలో హిజ్కియాకు యెషయా పరిచర్య చేశాడని ఇప్పటికే మనం చూశాము. అయితే, ఈ దండయాత్ర ముగిసిన తరువాత, హిజ్కియా మరిన్ని దాడుల నుండి తమ్ము నుతాము రక్షించుకోవాలని బబులోనీయులతో పొత్తు పెట్టుకోడానికి ప్రయత్నించాడు. యెషయా 39వ అధ్యాయములో, హిజ్కియా చేసిన దానిని ప్రవక్త కనుగొన్నాడు. కాబట్టి 39:5-7లో అతడు ఈ మాటలు పలికాడు:

> యెహోవా సెలవిచ్చు మాట వినుము: రాబోవు దినములలో ఏమియు మిగులకుండ నీ యింటనున్న సమస్తమును, నేటివరకు నీ పితరులు సమకూర్చి దాచిపెట్టినది అంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొని పోవుదురని ... నీ గర్భమందు పుట్టిన నీ పుత్రసంతును బబులోను రాజు నగరునందు నపుంసకులగా చేయుటకై వారు తీసికొనిపోవుదురు (యెషయా 39:5-7).

మరోసారి మనము మన యొక్క చర్చను రెండు విషయాలుగా విభజించుదాము: మొదటిగా, బబులోను ద్వారా తీర్పు కాలములోని ప్రధానమైన సంఘటనలను చూద్దాము, మరియు రెండవదిగా, ఈ కాలములో ప్రవక్తలు ఎలా పరిచర్య చేశారు? అను విషయమును చూద్దాము. బబులోను ద్వారా తీర్పు కాలములో జరిగిన ప్రధానమైన సంఘటనలను మొదటిగా చూద్దాము.

## ప్రధానమైన సంఘటనలు

ఈ కాలమును అర్థం చేసుకొనుటకు, మూడు ప్రధానమైన సంఘటనలను మనం గుర్తించాలి: మొదటిగా, క్రీ.పూ. 605లో మొదటి బబులోను దండయాత్ర, రెండవదిగా, క్రీ.పూ. 597లో రెండవ దండయాత్ర, మరియు మూడవదిగా, క్రీ.పూ. 586లో మూడవ దండయాత్ర.

### మొదటి దండయాత్ర

మొదటిగా, క్రీ.పూ. 605లో, మొదటి దండయాత్ర మరియు యూదా నాయకులను బబులోనుకు చెరగొనిపోవుట జరిగింది. రాజైన యెహోయాకీము బబులోను ప్రభువైన నెబుకద్నెజరుకు అపనమ్మకస్తుడుగా ఉన్నాడు, కాబట్టి నెబుకద్నెజరు యూదా రాజ్యమును స్వాధీనపరచుకొని, యెరూషలేములోని అనేకమంది నాయకులను తీసివేశాడు. ఈ సమయములో చెరగొనిపోబడిన వారిలో ప్రవక్తయైన దానియేలు మరియు అతని స్నేహితులైన షద్రకు, మేషాకు, మరియు అబేద్నెగో ఉన్నారు.

### రెండవ దండయాత్ర

ఈ కాలములోని రెండవ ప్రధానమైన సంఘటన క్రీ.పూ. 597లో జరిగింది. యూదా రాజ్యములో కొనసాగుచున్న తిరుగుబాటుకు నెబుకద్నెజరు రెండవ దండయాత్ర మరియు చెరగొనిపోవుటతో



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

స్పందించాడు. ఈ సమయంలో, అతడు యూదా రాజ్యములో ఎక్కువ భాగమును నాశనము చేశాడు మరియు అనేకమందిని బబులోనుకు చెరగొనిపోయాడు. ఈ దండయాత్రలో ప్రవక్తయైన యెహెజ్కేలును తీసుకొనిపోయాడు. ఈ రెండవ దండయాత్ర యూదా రాజ్యమును అనేక విధాలుగా బాధించింది, కాని రాజ్యము ఇప్పటికైనా దాని యొక్క చెడు మార్గములను గూర్చి పశ్చాత్తాపపడలేదు.

### మూడవ దండయాత్ర

బబులోను కాలములోని మూడవ ప్రధాన సంఘటన క్రీ.పూ. 586లో జరిగింది. నెబుకద్నెజరు యూదా రాజ్యములో కొనసాగిన తిరుగుబాటును బట్టి విసుగుచెంది, మూడవ, మరియు చివరి దండయాత్ర చేసి చెరగొనిపోయాడు. ఈ సమయంలో, బబులోనీయులు యెరూషలేమును మరియు దాని పరిశుద్ధ దేవాలయమును పూర్తిగా నాశనము చేశారు. యూదా రాజ్యములో చాలామంది ప్రజలు చెరగొనిపోబడ్డారు, మరియు భూమి నిర్జనమైపోయింది, మరియు యూదా రాజ్యము యొక్క భయంకరమైన చెర ఆరంభమైయ్యింది.

బబులోను ద్వారా తీర్పు కాలములోని ఈ మూడు ప్రధాన సంఘటలను గూర్చి మనం ఆలోచన చేసినప్పుడు, ఇది దేవుని ప్రజలకు అత్యంత నాశనకరమైన సమయమైయుండినది అని మనం జ్ఞాపకముంచుకోవాలి. దావీదు కుమారుడు చెరగొనిపోబడ్డాడు, మరియు యెరూషలేము దేవాలయము నాశనము చేయబడింది. దేవుని ప్రజల యొక్క చరిత్రలో ఇది భయంకరమైన సమయంగా ఉండినది.

బబులోను కాలములోని ప్రధాన సంఘటనలను మనము ఇప్పుడు చూశాము గనుక, ఈ కాలములో పాత నిబంధన ప్రవక్తలు పరిచర్య చేసిన విధానములను మనం చూద్దాము.

## ప్రవచనాత్మక పరిచర్యలు

చాలామంది పాత నిబంధన ప్రవక్తలకు బబులోను ద్వారా తీర్పు ఒక చారిత్రిక నేపథ్యమును ఏర్పాటు చేస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే, ఈ కాలములో ఏడుగురు ప్రవక్తలు యెహోవా రాయబారులుగా సేవ చేశారు: యిర్మీయా, జెఫన్యా, యోవేలు, ఓబద్యా, హబక్కూకు, యెహెజ్కేలు మరియు దానియేలు.

### యిర్మీయా

బబులోను కాలములోని మొదటి ప్రవక్త యిర్మీయా. మూడు దండయాత్రలు మరియు చెరగొనిపోయిన సమయంలో యిర్మీయా యూదా రాజ్యములో దేవుని ప్రవక్తగా పనిచేశాడు. యిర్మీయా 1:2-3లో మనం చదువునట్లుగా,

> ... యోషీయా యూదాకు రాజై యుండగా అతని యేలుబడి పదుమూడవ సంవత్సరమున ... యెహోయాకీము యూదాకు రాజైయుండగాను ... సిద్కియా యూదాకు రాజై యుండగాను, అతని యేలుబడి పదునొకండవ సంవత్సరాంతమువరకును, అనగా ఆ సంవత్సరమున అయిదవ నెలలో యెరూషలేము చెరదీసికొని పోబడువరకును ... (యిర్మీయా 1:2-3) యిర్మీయా పరిచర్య చేశాడు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

ఈ వచనముల నుండి, యిర్మీయా సుమారు క్రీ.పూ. 626 నుండి, బబులోనీయులు అష్షూరీయులను ఓడించక మునుపే పరిచర్య చేశాడని మనం చూస్తాము, మరియు 586లో బబులోనీయులు చివరిసారిగా దండయాత్ర చేసి చెరగొనిపోయిన తరువాత కనీసం కొంతకాలము వరకు అతడు యెహోవా రాయబారిగా పనిచేశాడు.

బబులోనీయులు మొదటిగా దండయాత్ర చేయక మునుపే, ఆక్రమణలను అరికట్టడానికి యిర్మీయా నిజమైన పశ్చాత్తాపం కొరకు పిలుపునిచ్చాడు. బబులోనీయుల యొక్క దాడుల తరంగాలు కొనసాగుతుండగా, యెరూషలేము ఖచ్చితముగా నాశనము చేయబడుతుంది అని యిర్మీయా అర్థం చేసుకున్నాడు. ప్రజలు పశ్చాత్తాపపడాలని మరియు కష్టముతో కూడిన సంవత్సరములను ఎదుర్కొనుటకు సిద్ధపడాలని అతడు పిలుపునిచ్చాడు. బబులోను చెర మీద అతడు దృష్టి సారించినప్పటికీ, భవిష్యత్తులో ఇశ్రాయేలు పునరుద్ధరించబడుతుందని కూడా యిర్మీయా ధృవీకరించాడు. ఉదాహరణకు, అతని పుస్తకములోని అధ్యాయములు 30-31లో, దేవుడు వారిని తిరిగి తమ భూమికి తీసుకొనివచ్చి, క్రొత్త నిబంధన ప్రకారం వారిని సురక్షితముగా ఉంచి స్థిరపరుస్తాడని యిర్మీయా యూదా ప్రజలకు జ్ఞాపకం చేశాడు.

## జెఫన్యా

బబులోను ద్వారా తీర్పు కాలములోని  రెండవ ప్రవక్త జెఫన్యా. అతడు దేవుని ప్రవక్తగా ఎప్పుడు సేవ చేశాడో జెఫన్యా 1:1 మనకు స్పష్టం చేస్తుంది. అతడు యూదా రాజగు ఆమోను కుమారుడైన యోషీయా దినములలో సేవ చేశాడు. యోషీయా క్రీ.పూ. 640 నుండి క్రీ.పూ. 609 వరకు యూదా రాజ్యమును పాలించాడు మరియు ఇది యిర్మీయా యొక్క ఆరంభ పరిచర్యకు జెఫన్యాను సమకాలీనుడిని చేస్తుంది. 2:13-15లో, బబులోనీయుల మాదిరిగానే నీనెవె పతనమైపోతుందని జెఫన్యా ప్రవచించాడు. వాస్తవంగా చెప్పాలంటే, దేవుని ప్రజలను హింసించిన అష్షూరు రాజ్యముకు మరియు ఇతర రాజ్యములకు వ్యతిరేకముగా ప్రభువు దినము వస్తుందని జెఫన్యా ప్రవచించాడు. యూదా రాజ్యముతో సహా ప్రాంతమంతటి మీద బబులోను ఆధిపత్యం చేస్తుందని అతడు భావించాడు. అయినప్పటికీ, ఇశ్రాయేలు మరియు యూదా రాజ్యములు పునరుద్ధరించబడు దినము వస్తుందని కూడా జెఫన్యా ప్రకటించాడు. 3:20లో అతడు చెప్పినట్లుగా:

> ఆ కాలమున మీరు చూచుచుండగా నేను మిమ్మును చెరలోనుండి రప్పించి, మిమ్మును సమకూర్చిన తరువాత మిమ్మును నడిపింతును; నిజముగా భూమిమీద నున్న జనులందరి దృష్టికి నేను మీకు ఖ్యాతిని మంచి పేరును తెప్పింతును; ఇదే యెహోవా వాక్కు (జెఫన్యా 3:20).

## యోవేలు

బబులోను ద్వారా తీర్పు కాలములో కనిపించే మూడవ ప్రవక్త యోవేలు. యోవేలు పరిచర్య కాలమును గూర్చి మనము ఖచ్చితముగా చెప్పలేము ఎందుకంటే అతని పుస్తకం అతని పరిచర్యను గూర్చి ఒక నిర్దిష్ట సమయమును ఇవ్వదు. కొందరు వ్యాఖ్యతలు యోవేలును ఆరంభ కాలములో ఉంచుతారు, మరికొందరు తరువాత కాలములో ఉంచుతారు. అయితే యోవేలు ప్రవచించినప్పుడు



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

దేవాలయము మరియు యాజకత్వము మనుగడలో ఉన్నవి అని 1:13 మరియు అనేక ఇతర వాక్యభాగముల నుండి మనం చెప్పవచ్చు. సీయోను నాశనము చేయబడబోతుంది అని 2:1లో యోవేలు ప్రకటించాడు. కాబట్టి యూదులను బబులోనుకు చెరగొనిపోయిన సమయంలో యోవేలు కొంతకాలం పరిచర్య చేశాడు. అతని సందేశం చాలా సూటిగా ఉంది – యూదా రాజ్యమును ఇతర రాజ్యములు నాశనం చేయబోతున్నాయి. మరియు అధ్యాయము 2లో, పశ్చాత్తాపపడమని మరియు హృదయపూర్వకమైన పశ్చాత్తాపం బబులోను యొక్క నాశనమును నిరోధించగలదు లేదా తగ్గించగలదు అని యోవేలు ప్రజలకు పిలుపునిచ్చాడు. నాశనము వస్తుంది అని చెప్పి ముగించిన తరువాత కూడా, యోవేలు దేవుని ఆశీర్వాదమును గూర్చి మాట్లాడకుండ ఉండలేదు. చెర ముగిసిన తరువాత, దేవుడు తన ప్రజలను పునరుద్ధరించి అధిగమించలేని నిబంధనా ఆశీర్వాదపు సమయంలోకి నడిపిస్తాడని అతడు తన పాఠకులకు హామీ ఇచ్చాడు. యోవేలు 3:20-21లో అతడు చెప్పినట్లుగా:

> ఈలాగున నేను ఇంతకుముందు ప్రతికారము చేయని ప్రాణదోషమునకై ప్రతికారము చేయుదును. అయితే యూదాదేశములో నివాసులు నిత్యముందురు, తరతరములకు యెరూషలేము నివాసముగా నుండును, యెహోవా సీయోనులో నివాసిగా వసించును (యోవేలు 3:20-21).

## ఓబద్యా

బబులోను ద్వారా తీర్పు కాలములోని నాలుగవ ప్రవక్త ఓబద్యా. అతని పుస్తకము కూడా కాలమును గూర్చి చెప్పదు, కాని యూదా వారి యొక్క భయంకరమైన బాధలను ఎదోము దేశము ఎలా ఉపయోగించుకొంది అనే దాని మీద అది దృష్టి పెడుతుంది. క్రీ.పూ. 597 నుండి 586 సంవత్సరములలో యూదా రాజ్యము మీద బబులోను చేసిన దండయాత్రలు మరియు చెరగొనిపోయిన సమయంలో యూదా రాజ్యము ఎదుర్కొనిన ఇబ్బందులు ఓబద్యా మనస్సులో ఉండినవి. ఎదోమీయుల యొక్క క్రూరత్వమును యెహోవా పట్టించుకోకుండా ఉండడు అని ఓబద్యా ప్రకటించాడు. ఎదోము నాశనము చేయబడుతుంది. వాస్తవంగా చెప్పాలంటే, ఒక దినమున చెరగొనిపోబడిన యూదా వారు తిరిగి వచ్చి ఎదోమీయుల యొక్క స్వాస్థ్యమును తీసుకుంటారని అతడు ప్రకటించాడు. అతని పుస్తకములోని 15వ వచనములో ఓబద్యా చెప్పినట్లుగా:

> యెహోవాదినము అన్యజనులందరిమీదికి వచ్చు చున్నది. అప్పుడు నీవు చేసినట్టే నీకును చేయబడును, నీవు చేసినదే నీ నెత్తిమీదికి వచ్చును (ఓబద్యా 15).

యూదా రాజ్యము యొక్క చెర ముగిసిన తరువాత, దేవుడు తన ప్రజలను హింసించినందుకు రాజ్యములను శిక్షిస్తాడని ఓబద్యా ప్రకటించాడు.

## హబక్కూకు

బబులోను ద్వారా తీర్పు కాలములో పరిచర్య జరిగించిన ఐదవ ప్రవక్త హబక్కూకు. మరోసారి, అతడు ఎప్పుడు పరిచర్య చేశాడో మనకు తెలియదు, అయినను అతని పుస్తకములోని విషయసూచిక మనకు కొంత మార్గదర్శకమును ఇస్తుంది. హబక్కూకు పుస్తకములోని మొదటి అధ్యాయములో,



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్మిల్లీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

యూదా రాజ్యములో భక్తిహీనులైన పాలకుల యొక్క నాశనము కొరకై ప్రవక్త ప్రార్థించుచున్నాడు. దేవుని యొక్క జవాబు 1:6లో కనిపిస్తుంది. ఆలకించుడి,

> తమవికాని ఉనికిపట్టులను ఆక్రమించవలెనని భూదిగంతములవరకు సంచరించు ఉద్రేకముగల క్రూరులగు కల్దీయులను నేను రేపుచున్నాను (హబక్కూకు 1:6).

ఈ వాక్యభాగము యొక్క వెలుగులో, క్రీ.పూ. 605లో బబులోను మొదటిగా దండయాత్ర చేసి చెరగొనిపోయిన సమయంలో హబక్కూకు పరిచర్య చేసినట్లు తెలుస్తుంది.

హబక్కూకు మొదటిగా యూదా వారి యొక్క చెడుతనమును గూర్చి, తరువాత బబులోనీయుల యొక్క అణచివేతను గూర్చి విలపించాడు, అయితే అతని పుస్తకము యొక్క చివరి భాగములో, బబులోనీయులను నాశనము చేయడానికి దేవుడు ఎంత సమయం తీసుకున్నప్పటికీ కూడా, హబక్కూకు యెహోవా మీద తనకున్న నమ్మకమును ధృవీకరించాడు. 3:17-18లో, ప్రసిద్ధిగాంచిన విశ్వాసపు మాటలను మనం చదువుతాము:

> అంజూరపు చెట్లు పూయకుండినను ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను ఒలీవచెట్లు కాపులేకయుండినను చేనిలోని పైరు పంటకు రాకపోయినను గొఱ్ఱలు దొడ్డిలో లేకపోయినను సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవాయందు ఆనందించెదను నా రక్షణకర్తయైన నా దేవునియందు నేను సంతోషించెదను (హబక్కూకు 3:17-18).

## యెహెజ్కేలు

బబులోను కాలములో పరిచర్య జరిగించిన ఆరవ ప్రవక్త యెహెజ్కేలు. క్రీ.పూ. 597లో ప్రవక్త బబులోనుకు చెరగొనిపోబడ్డాడు అని 1వ అధ్యాయము, 2వ వచనము మనకు బోధిస్తుంది. అతడు బబులోనులో, చెరగొనిపోబడిన వారి మధ్య సేవ చేశాడు, మరియు ఈ పుస్తకములోని మిగిలిన భాగము స్పష్టం చేస్తున్నట్లుగా, యెహెజ్కేలు క్రీ.పూ. 586లో యెరూషలేము నాశనము చేయబడిన సమయంలో కూడా సేవచేశాడు. కాబట్టి యెహెజ్కేలు క్రీ.పూ. 597 మొదలుకొని క్రీ.పూ. 586లో యెరూషలేము పతనము వరకు పరిచర్య చేశాడు. యెహెజ్కేలు తన యొక్క ఆరంభ పరిచర్యలో ఎక్కువగా బబులోనీయులు యెరూషలేమును మరియు దాని దేవాలయమును నాశనము చేయబోతున్నారని ప్రకటించాడు. అంతేకాకుండ, యెహెజ్కేలు గ్రంథములో ఎక్కువ భాగం ప్రజలు తమ భూమికి ఎలా తిరిగివస్తారు మరియు తిరిగి వచ్చినప్పుడు దేవాలయమును ఎలా పునర్నిర్మించాలి అనే విషయము మీద దృష్టి పెడుతుంది. పట్టణము మరియు దేవాలయము ఊహకు మించిన విధముగా ఎంత గొప్పగా ఉంటాయో వివరించిన తరువాత, 48:35లో అతడు తన పుస్తకమును ఈ విధంగా ముగించాడు:

> యెహోవా యుండు స్థలమని నాటనుండి ఆ పట్టణమునకు పేరు (యెహెజ్కేలు 48:35)



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

## దానియేలు

బబులోను ద్వారా తీర్పు కాలములో పరిచర్య జరిగించిన ఏడవ ప్రవక్త దానియేలు. క్రీ.పూ. 605లో మొదటిగా దండయాత్ర చేసినప్పుడు దానియేలును బబులోనుకు చేరగొనిపోయారు. అతని పుస్తకములోని సంఘటనలను గూర్చిన సూచనలు దానియేలు పరిచర్య కనీసం క్రీ.పూ. 605 నుండి 539 వరకు విస్తరించిందని స్పష్టం చేస్తాయి. దానియేలు అనువదించిన కలలు మరియు అతనికి కలిగిన అనేక దర్శనములు యూదా రాజ్యము యొక్క చెర సుదీర్ఘ కాలం పాటు ఉంటుందని స్పష్టం చేస్తాయి. దేవుని ప్రజలు చెరలో ఉన్నప్పటికీ తమ పాపములకు పశ్చాత్తాపం పొందలేదని అతడు గ్రహించాడు, గనుక 9:13లో అతడు ఇలా చెప్పాడు:

> మోషే ధర్మశాస్త్రమందు వ్రాసిన కీడంతయు మాకు సంభవించినను మేము మా చెడునడవడి మానక పోతిమి; నీ సత్యమును అనుసరించి బుద్ధి తెచ్చుకొనునట్లు మా దేవుడైన యెహోవాను సమాధానపరచుకొనక పోతిమి (దానియేలు 9:13).

తత్ఫలితంగా, దేవుని ప్రజల యొక్క చెర నాలుగు రాజ్యముల ద్వారా విస్తరిస్తుందని దానియేలు తెలుసుకున్నాడు: బబులోనీయులు, మాదీయులు మరియ పారసీకులు, గ్రీకులు మరియు అనామధేయమైన నాలుగవ రాజ్యము, అది రోమా సామ్రాజ్యము అని ఇప్పుడు మనకు తెలుసు. పశ్చాత్తాపము మరియు విశ్వాసము ఉండాలని చెరలోని ప్రజలను దానియేలు ప్రోత్సహించాడు మరియు తిరుగుబాటు చేయుటను కొనసాగించినట్లైతే తమ దేశము నుండి యెడబాటు కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించాడు.

బబులోను ద్వారా తీర్పును ఎంత ఉద్ఘాటించినా తక్కువే అవుతుంది. ఇది దేవుని ప్రజలు తమ ఘోరమైన ఓటమిని రుచి చూచే సమయంగా ఉండినది; దేవుని ప్రజలు యూదా రాజ్యము నుండి చెరగొనిపోబడ్డారు; దావీదు కుమారుడు తన సింహాసనము నుండి చెరగొనిపోబడ్డాడు; యెరూషలేము పట్టణము నాశనము చేయబడింది మరియు దేవుని ఆలయము కూడా నాశనము చేయబడింది. పాత నిబంధన గ్రంథములో దేవుని ప్రజల జీవితములో కలిగిన అత్యంత ఘోరమైన సంఘటన ఇది. మరియు ఈ సమయంలో, ప్రవక్తలు అనేక హెచ్చరికలను మరియు తీర్పులను ఇచ్చారు, కాని ఒక దినమున దేవుడు తన ప్రజలను యెరూషలేముకు మరియు యూదా రాజ్యముకు పునరుద్ధరిస్తాడని వారు నిరీక్షించారు.

ప్రవచనము యొక్క చారిత్రిక విశ్లేషణ అను ఈ పాఠంలో ఇప్పటివరకు, ప్రధానమైన సంఘటనలను మరియు ప్రవచనాత్మక పరిచర్యలను మూడు కాలములలో మనము చూశాము. ఇప్పుడు మనము పాత నిబంధన ప్రవచనము యొక్క చివరి కాలమును చూద్దాము, అది పునరుద్ధరణ కాలము.

# పునరుద్ధరణ కాలము

మనము చూచినట్లుగా, ఆరంభ రాచరికము బైబిలులో రచయితలైన ప్రవక్తలకు నేపథ్యమును ఏర్పాటు చేసింది. చాలామంది ప్రవక్తలు అష్షూరు ద్వారా తీర్పు కాలములో పరిచర్య చేశారు, మరియు బబులోను ద్వారా తీర్పు కాలములో మరింతగా దేవుని సేవ చేశారు. కొందరు ఇశ్రాయేలీయులు బబులోను చెర నుండి యూదా రాజ్యముకు తిరిగి వచ్చినప్పుడు దేవుని ప్రజలకు పరిచర్య చేసిన ప్రవక్తలను గూర్చి ఇప్పుడు మనం పరిశీలన చేయాలి. ఈ పునరుద్ధరణ కాలము క్రీ.పూ. 539 నుండి క్రీ.పూ. 400 వరకు విస్తరించబడియున్నది అని మనం చెప్పవచ్చు. ఈ కాలములోని ప్రధానమైన సంఘటనల మీద, తరువాత ప్రవచనాత్మక పరిచర్యల మీద దృష్టి పెట్టడం ద్వారా ఈ కాలమును సాధారణ మార్గంలో అన్వేషించుదాము. పునరుద్ధరణ కాలములోని ప్రధానమైన సంఘటనలను మొదటిగా చూద్దాము.

## ప్రధానమైన సంఘటనలు

ఇశ్రాయేలీయులు తమ దేశముకు తిరిగి వచ్చారు అనునది మనము చెప్పవలసిన మొదటి విషయమైయున్నది.

### ఇశ్రాయేలీయులు దేశమునకు తిరిగి వచ్చుట

క్రీ.పూ. 539 మరియు 538లో, చెరలోనున్న తన ప్రజల కొరకు దేవుడు ఒక అద్భుతకార్యమును చేశాడు. యెషయా ప్రవచన నెరవేర్పుగా, పారసీక దేశపు రాజైన కోరెషు బబులోను దేశపు రాజును ఓడించి, ఇశ్రాయేలీయులు తమ దేశముకు బయలుదేరివెళ్లి యెహోవా ఆలయమును పునర్నిర్మించుమని ప్రోత్సహించాడు. చెరలో నుండి ప్రజల యొక్క ఈ ప్రారంభ పునరుద్ధరణ షేష్బజ్జరు నాయకత్వములో జరిగింది, ఇతడు దావీదు సింహాసనముకు సరైన వారసుడైన జెరుబ్బాబెలు అని చాలామంది భావిస్తారు. అయితే, చెర నుండి తిరిగివచ్చిన వారు చాలా తక్కువ మంది, మరియు వారు యెహోవా చిత్తమును జరిగించుటకు అంత సమర్పణ కలిగినవారు కాదు.

### దేవాలయము యొక్క పునర్నిర్మాణం

ఇప్పుడు, ఈ వాస్తవము పునరుద్ధరణ కాలములోని రెండవ ప్రధానమైన సంఘటన వైపు మనలను నడిపిస్తుంది, అది క్రీ.పూ. 520 నుండి 515కు మధ్య కాలములో దేవాలయము యొక్క పునర్నిర్మాణము. మొదటిగా తమ దేశములోకి తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులు దేవాలయమును పునర్నిర్మించలేదు. వారు నిర్మాణమును ఆరంభించారు, కాని వెంటనే తమ అవసరతలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి నిర్మాణమును ఆపివేశారు. దేవాలయమును పునర్నిర్మించాల్సిన బాధ్యతను దేవుని ప్రజలు నిర్లక్ష్యపెట్టారు గనుక, ప్రవక్తలైన హగ్గయి మరియు జకర్యాలు క్రీ.పూ. 520లో వీధులలోకి వెళ్లి దేవాలయమును పునర్నిర్మించుమని ప్రజలను హెచ్చరించారు. మొదటిగా గొప్ప ఆశావాదం మరియు నిరీక్షణ ఉండినది, కాని ఆ ఆశావాదం ఎక్కువ కాలం లేకపోయింది.

### విస్తృతమైన మతభ్రష్టత్వము

పునరుద్ధరణ కాలములోని మూడవ గొప్ప సంఘటన ఏమిటంటే విస్తృతమైన మతభ్రష్టత్వము. ఇప్పుడు, ఈ మతభ్రష్టత్వము దేవాలయమును పునర్నిర్మించుటకు మొదలుపెట్టిన తరువాత, విశేషముగా ఎజ్రా మరియు నెహెమ్యా కాలములో పెరిగింది. ఈ కాలము యొక్క ఖచ్చితమైన తేదీలను గూర్చి పండితులు వివాదిస్తారు కాబట్టి క్రీ.పూ. 450 నుండి 400 మధ్య ఉన్న విశాలమైన కాలవ్యవధిని మనము నిర్ణయించవచ్చును. జెరుబ్బాబెలు దేవాలయమును పునర్నిర్మించిన తరువాత ఒక తరములోనే, దేవుని ప్రజలు విదేశీ స్త్రీలతో వివాహము చేసుకోవడం ఆరంభించారు, తత్ఫలితంగా, ఇశ్రాయేలు మతము ఇతర మతములతో కలిసిపోయింది. పునరుద్ధరణ కాలము నిలిచిపోయింది. ఇప్పుడు ఎజ్రా మరియు నెహెమ్యా కొన్ని సంస్కరణలు చేసి, కొంతకాలం పనిచేశారు, కాని ఆ సంస్కరణలు విఫలమవ్వడానికి ఎంతో సమయం పట్టలేదు. పునరుద్ధరణ కాలము ఒక గొప్ప మతభ్రష్టత్వ కాలముగా మారిపోయింది.

పునరుద్ధరణ కాలములోని రెండవ విషయమును ఇప్పుడు మనం చూద్దాము. ఈ కాలములో పరిచర్య చేసిన ప్రవక్తలను ఈ సంఘటనలు ఎలా ప్రభావితం చేశాయి?

## ప్రవచనాత్మక పరిచర్యలు

ముగ్గురు ప్రసిద్ధి చెందిన ప్రవక్తలు ఎవరనగా హగ్గయి, జెకర్యా మరియు మలాకీ. హగ్గయి పరిచర్యను మొదటిగా చూద్దాము.

### హగ్గయి

దేశముకు తిరిగివచ్చిన వారిలో ఈ ప్రవక్త కూడా ఉన్నాడని హగ్గయి గ్రంథము స్పష్టముగా తెలియజేస్తుంది. తత్ఫలితంగా, అతడు యెరూషలేములో పరిచర్య చేశాడు. అంతేకాకుండ, హగ్గయి ఎప్పుడు పరిచర్య చేశాడో మనకు స్పష్టంగా తెలుసు. ఆరవనెల మొదటి దినమున ప్రవక్తయగు హగ్గయి ద్వారా యూదా దేశముమీద అధికారియైన జెరుబ్బాబెలుతో దేవుడు మాట్లాడాడు అని హగ్గయి 1:1లో మనము చదువుతాము. ఇది మరియు హగ్గయి గ్రంథములోని ఇతర వాక్యభాగముల ద్వారా, హగ్గయి ప్రవచనములన్నీ క్రీ.పూ. 520లో నాలుగు నెలల కాలములో ఇవ్వబడ్డాయని మనం నేర్చుకుంటాము.

ఇప్పుడు హగ్గయి యొక్క సందేశం ఏమిటి? దేవాలయమును పునర్నిర్మించడానికి అలమటిస్తున్న యూదావారిని ప్రేరేపించాలని హగ్గయి నిశ్చయించుకున్నాడు. వాస్తవంగా చెప్పాలంటే, అతడు మరియు అతని ప్రజలు తమ పాపముల విషయమై పశ్చాత్తాపపడినట్లైతే గొప్ప విజయాలు మరియు ఆశీర్వాదములు పొందుకుంటారు అని హగ్గయి ప్రవచించాడు. 2:21లో అతడు చెప్పినట్లుగా:

> యూదాదేశపు అధికారియగు జెరుబ్బాబెలుతో ఇట్లనుము ఆకాశమును భూమిని నేను కంపింపజేయుచున్నాను (హగ్గయి 2:21).

దేశము హృదయపూర్వకముగా దేవుని వైపు తిరిగి, దేవాలయమును పునర్నిర్మించినట్లైతే దేవుడు గొప్ప ఆశీర్వాదములు ఇస్తాడని హగ్గయి ప్రకటించాడు.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

### జెకర్యా

పునరుద్ధరణ కాలములోని రెండవ ప్రవక్త జెకర్యా. జెకర్యా ప్రవచనముల ద్వారా, అతడు హగ్గయితో పాటు యెరూషలేములో పరిచర్య చేశాడని మనం నేర్చుకుంటాము. దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరము ఎనిమిదవ నెలలో, అనగా క్రీ.పూ. 520లో హగ్గయి పరిచర్యను ఆరంభించాడు అని 1వ అధ్యాయము 1వ వచనము బోధిస్తుంది. జెకర్యా 9-14 అధ్యాయముల ప్రకారం, దేవుని ఆశీర్వాదములు పొందుకోవాలంటే దేవాలయమును పునర్నిర్మిస్తే సరిపోదని స్పష్టమైన తరువాత, జెకర్యా పరిచర్య కొనసాగింది అని చాలామంది వ్యాఖ్యాతలు నమ్ముతారు. అతని యొక్క పరిచర్య ఆరంభంలో, మొదటి ఎనిమిది అధ్యాయములలో సంగ్రహించబడినట్లుగా, ప్రవక్త యొక్క సందేశం చాలా సరళంగా ఉంది: ప్రజలు దేవాలయమును పునర్నిర్మించినట్లైతే గొప్ప ఆశీర్వాదములు పొందుతారు. అయితే, దీనికి మించి, అధ్యాయములు 9-14లో, సంపూర్ణ పునరుద్ధరణ భవిష్యత్తులో దేవుడు జోక్యం చేసుకొనుట ద్వారా మాత్రమే వస్తుందని జెకర్యా ప్రకటించాడు. భవిష్యత్తులో దేవుడు జోక్యం చేసుకొని తన ప్రజలకు నీతి మరియు విజయమును చేకూర్చే గొప్ప సంఘటనలను గూర్చిన దర్శనములను ప్రవక్త కలిగియున్నాడు. 14:20లో అతడు చెప్పినట్లుగా:

> ఆ దినమున గుఱ్ఱములయొక్క కళ్లె ములమీద యెహోవాకు ప్రతిష్టితము అను మాట వ్రాయబడును; యెహోవా మందిరములోనున్న పాత్రలు బలిపీఠము ఎదుటనున్న పళ్లెములవలె ప్రతిష్ఠితములుగా ఎంచబడును (జెకర్యా 14:20).

### మలాకీ

ఇప్పుడు, పాత నిబంధన గ్రంథములోని చివరి ప్రవక్త మలాకీ. మలాకీ కూడా యెరూషలేము ప్రాంతములో పరిచర్య చేశాడు అని దేవాలయము మరియు లేవీయుల మీద ఆయన దృష్టిపెట్టిన విధానం ద్వారా స్పష్టం చేయబడింది. అతని సందేశం నెహెమ్యా సంస్కరణల కాలములో లేదా తరువత కాలములో, అనగా సుమారు క్రీ.పూ. 450 నుండి 400 మధ్య కాలములో సరిగా అమర్చబడుతుంది. దేవాలయపు పనులు భ్రష్టుపట్టిపోయాయి, మరియు ప్రజలు దేవుని నుండి వెనుదిరిగారు కాబట్టి దేవుని ప్రజలకు వ్యతిరేకంగా గొప్ప తీర్పు రాబోతుందని మలాకీ ప్రకటించాడు. మలాకీ 3:5లో మనము చదువునట్లుగా:

> తీర్పు తీర్చుటకై [యెహోవా] మీయొద్దకు రాగా (మలాకీ 3:5).

అయిననూ, భవిష్యత్తులో దేవుని తీర్పు కూడా ఇశ్రాయేలులోని నీతిమంతుల యొక్క తుది పునరుద్ధరణకు దారితీస్తుందని మలాకీకి తెలుసు. 4:2లో, పశ్చాత్తాపపడి దేవునికి నమ్మకస్తులుగా నిరూపించుకొనేవారికి మలాకీ నిరీక్షణను ఇచ్చాడు:

> అయితే నా నామమందు భయ భక్తులుగలవారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును; అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీరు బయలుదేరి క్రొవ్విన దూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు (మలాకీ 4:2).



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి

తీర్పు తరువాత గొప్ప ఆశీర్వాదపు కాలము వస్తుందని ఇశ్రాయేలు మతభ్రష్టత్వములో ఉన్నప్పుడు కూడా మలాకీ హామీ ఇచ్చాడు.

పునరుద్ధరణ కాలములోని ప్రవక్తలు గొప్ప సంక్షోభముతో వ్యవహరించవలసి ఉండినది. చెర నుండి తిరిగి వచ్చిన దేవుని ప్రజలు దేవుని మీద తిరుగుబాటు చేయడం కొనసాగించారు, తత్ఫలితంగా, గొప్ప పునరుద్ధరణ ఆశీర్వాదములు సుదూర భవిష్యత్తులో మాత్రమే వస్తాయని తేల్చి చెప్పారు. ఇప్పుడు, క్రైస్తవులముగా, ఈ సుదూర భవిష్యత్తు ఎప్పుడు వచ్చిందో మనకు తెలుసు – యేసు భూలోకమునకు వచ్చినప్పుడు.

## ముగింపు

ఈ పాఠంలో పాత నిబంధన ప్రవక్తల యొక్క చారిత్రిక విశ్లేషణను మనము పరిశీలించాము. చరిత్ర సంక్లిష్టముగా ఉన్నప్పటికీ, నాలుగు ప్రధాన కాలముల దృష్ట్యా ప్రవచనాత్మక చరిత్ర యొక్క సంఘటనలను క్లుప్తంగా చెప్పుట సహాయకరంగా ఉంటుంది: మొదటిగా, ఆరంభ రాచరికము; రెండవదిగా, అష్షూరు ద్వారా తీర్పు; మూడవదిగా, బబులోను ద్వారా తీర్పు; మరియు నాలుగవదిగా, చెర-తరువాత కాలము, ఇది ఆరంభములో గొప్ప నిరీక్షణ కలిగిన కాలముగా ఉండెను, కాని తుదకు ఆ నిరీక్షణలు మరిఎక్కువ తీర్పుకు దారితీశాయి, తరువాత సుదూర భవిష్యత్తులో దేవుని యొద్ద నుండి ఆశీర్వాదము కలిగింది.

మనము పాత నిబంధన ప్రవచనమును అనువదించుట నేర్చుకొనుచుండగా, వారి మాటలను వారి పరిస్థితులకు అనుసంధానించుట ఎల్లప్పుడు ముఖ్యమైన విషయముగా ఉంది. ప్రవక్తల యొక్క మాటలను వారు ఎదుర్కొనిన పరిస్థితులకు అనుసంధానించుచుండగా, ఆ కాలములోని ప్రజలకు వారి మాటలు ఎటువంటి అర్థమును ఇచ్చినవో మరియు వారి మాటలు నేడు మనకు ఏ విధంగా అనువర్తించబడుతున్నవో మనం అర్థము చేసుకొనగలుగుతాము.



వీడియోలు, స్టడీగైడ్స్ మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ను thirdmill.org నందు సందర్శించండి